క్లుప్తంగా

టెక్నికల్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి భార్యాపిల్లలకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: క్యాన్సర్‌తో మృతిచెందిన ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ ఎస్ఎండీ ఇసాక్ కుటుంబానికి శనివారం టెక్నికల్ అసిస్టెంట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇసాక్ గతనెల 31న క్యాన్సర్‌తో మృతి చెందాడు. ఈక్రమంలో శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో టీఏ అసోషియేషన్ ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేశారు. డ్వామా ఏపీ విజయలక్ష్మి, ఎంపీడీఓ వెంకటరమణప్ప ఇసాక్ సేవలను కొనియాడారు. టీఏ అసోసియేషన్ తరఫున ఇసాక్ భార్య హసీనాకు రూ.1.08 లక్షల నగదును అందజేశారు.

గుంతకల్లును క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దుదాం



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న చైర్‌పర్సన్ భవాని, వీసీ మైమూన్, కమిషనర్

గుంతకల్లుటౌన్: పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దుదామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్. భవాని, కమిషనర్ మల్లికార్జున పిలుపునిచ్చారు. స్వచ్ఛత హి సేవలో భాగంగా శనివారం స్వచ్ఛతా లీగ్ 2.0 సఫాయ్ మిత్ర సురక్ష షివిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెయిన్ రోడ్డులో వారు చీపుర్లను పట్టుకుని చెత్తాచెదారాన్ని ఊడ్చేశారు. డివైడర్ల మధ్యన నాటిన మొక్కల చుట్టూ పెరిగిపోయిన పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛ గుంతకల్లు ఏర్పాటుకు సంకల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్, అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, ఎంఈ గురప్ప, మేనేజర్ రంగనాథం, మెప్మా టీపీఆర్ఓ మోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, టీపీఎస్ అబ్దుల్‌సత్తార్, సెక్రటరీ, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై కొడవలితో దాడి

గుత్తి రూరల్: బేతాపల్లిలో శనివారం రాత్రి రస్తా విషయంపై జరిగిన ఘర్షణలో వ్యక్తిపై కొడవలితో దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బాబుకు ఇంటి పక్కన ఉన్న ధను, ప్రతాప్, తిమ్మప్పలతో కొన్ని రోజుల నుంచి రస్తా విషయంలో గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి అదే విషయంలో మరో మారు ఘర్షణ పడ్డారు. మాట మాట పెరిగి బాబుపై ధను, ప్రతాప్, తిమ్మప్ప కొడవలితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ బాబును వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


గులాబీ పురుగు నివారణపై దృష్టి పెట్టండి



గుత్తిఅనంతపురం వద్ద కొర్రపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పెద్దవడుగూరు: పత్తిలో గులాబీరంగు పురుగు నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రెడ్డిపల్లి కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త కిశోర్‌కుమార్, గుత్తి ఏడీఏ వెంకట్రాముడు, డీఆర్‌సీ మద్దిలేటి రైతులకు సూచించారు. శనివారం మిడుతూరు, గుత్తిఅనంతపురం, పామిడి మండలం రామరాజుపల్లిలో పత్తి, కొర్ర , జొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గులాబీరంగు పురుగు నివారణకు గ్యాసిస్ ల్యూర్ అనే పేస్టును మొక్కలకు పూయాలని సూచించారు. మొదటి దశ లో ప్రొఫినోపాస్ 2 మి.లీ 1 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పురుగు ఉధృతి అధికంగా ఉంటే పైరిడాలిత్ 2 మి.లీ లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆత్మా బీటీఎం లావణ్య, ఏఓ మల్లేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

పాము కాటుతో యువకుడి మృతి



మనోహర్ (ఫైల్)

యాడికి: పాము కాటుతో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు...కూర్మాజీపేటకు చెందిన రామాంజనేయులు, రమాదేవి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో చిన్న కుమారుడు మనోహర్ (20) శుక్రవారం రాత్రి ఇంటిపై నిద్రిస్తుండగా కాలిపై కట్లపాము కాటేసింది. వెంటనే మనోహర్ కుటుంబసభ్యులను అప్రమత్తమం చేయడంతో వారు పామును చంపేశారు. అనంతరం ప్రైవేట్ వాహనంలో తాడిపత్రిలోని సీహెచ్‌సీకి మనోహర్‌ను తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు.

వైద్య రంగానికి జగనన్న పెద్దపీట



గుత్తి: అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి

- గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుత్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్ద పీట వేశారని ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి అన్నారు. గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లిలో రూ. 85 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను శనివారం ఎమ్మెల్యే మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్మన్ వరలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, పద్మలత, కౌన్సిలర్ గద్దల రూతమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ వైద్య, విద్యా రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి పంచాయతీలో హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశారన్నారు. గత శుక్రవారం రాష్ట్రంలో కొత్తగా 5 మెడికల్ కాలేజీలను ప్రారంభించారని గుర్తు చేశారు. నాడు -నేడు పథకం కింద ఆసుపత్రులు, పాఠశాలల రూపు రేఖలు మార్చారన్నారు. డీఎంఓ చెన్నకేశవులు, ఎంపీపీ విశాలక్ష్మి, మార్కెట్ యార్డు చైర్మన్ సునీలా, సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి, సచివాలయ పట్టణ, మండల కన్వీనర్లు రంగస్వామి, సుభాష్‌రెడ్డి, బేడల వెంకట రాముడు, కౌన్సిలర్లు బుసా రూపావతి, కేవీ రమణ, ఫరూక్, వరదరాజులు,వెంకట సుబ్బయ్య, వాల్మీకి శివ, సీనియర్ నాయకులు సీవీ రంగారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, దేవా, జీపు రమణ, హరి , వలి, గద్దల నాగేంద్ర, వీరా, జగ్గు, గద్దల నాగరాజు, వెంకటేష్, నాగమణి , సుందర రాజ్, మెడికల్ ఆఫీసర్లు విష్ణుమూర్తి, ఎల్లా రాముడు, బిందు భారతి పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశే జగనన్న లక్ష్యం

గుంతకల్లుటౌన్: కామన్ మ్యాన్‌కు కూడా ఖరీదైన వైద్యాన్ని, మందులను ఉచితంగా అందించి ఈ రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే సీఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం తిలక్‌నగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్య పరిరక్షణకు ఎన్నో కార్యక్రమాలను చేపట్టిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య విషయాలపై సర్వే నిర్వహించడమే కాకుండా అవసరమైన వారికి మందులను అందజేస్తారన్నారు. వైద్యులతో హెల్త్‌క్యాంపులు నిర్వహించి ఏవైనా జబ్బులు గుర్తించినట్లయితే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే షుగర్, బీపీ పరీక్షలు చేయించుకున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్ మైమూన్, కమిషనర్ మల్లికార్జున, మెడికల్ ఆఫీసర్లు స్వాతి, జ్యోత్స్న, సంజీవ్, ఉమామహేశ్వరి, హరిత, అరుణ, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, పార్టీ వార్డు ఇన్‌ఛార్జ్ టి.గోపి, కౌన్సిలర్ మెహరున్నీసా, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌ఛార్జ్ జింకల రామాంజినేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దాం

వినాయకచవితిని పురస్కరించుకుని ప్రజలు మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేశారు. రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, శివానంద, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు రేణుక, ప్రతిమల దాత శ్రవణ్, రొటేరియన్లు ప్రదీప్, అనురాధగుప్త పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు రక్ష

తాడిపత్రి అర్బన్: ప్రజారోగ్యం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన భగత్‌సింగ్ నగర్ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేయడంతోపాటు ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదు దశల్లో కార్యక్రమం ఉంటుందని, ఉచితంగా 7 రకాల పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈనెల 30 నుంచి దాదాపు 14 రోజుల పాటు నలుగురు వైద్యులతో హెల్త్ క్యాంపులు ఉంటాయన్నారు. ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు

20వ వార్డులో 'గడప గడపకూ'

20 వార్డు పరిధిలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రవి, వైద్యులు శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ రఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కొనుదుల సురేష్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, నటరాజేశ్వర్‌రెడ్డి, డివి.కుమార్, పేరం ప్రతాప్‌రెడ్డి, సూర్యప్రభాకర్‌బాబు, గంగులకుంట కేశవరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, కార్యదర్శులు, వలంటీర్లు, హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. శనివారం రేకులకుంట సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్షపై వైద్యసిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటా సర్వే చేసి ఎవరికి ఏఏ ఆరోగ్య సమస్యలు ఉన్నాయో వైద్య పరీక్షలు చేసి గుర్తించాలన్నారు. ఈ నెల 30న మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి పేదలకు వైద్య సేవలు అందించాలన్నారు. తహసీల్దార్ రమాదేవి, సర్పంచ్ నరసమ్మ, వైస్ ఎంపీపీ జయలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, సాకే లక్ష్మీనారాయణ, కొర్రపాడు పీహెచ్‌సీ డాక్టర్ శ్రీహర్ష, వినోద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



భగత్‌సింగ్‌నగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యల్లనూరు: నిట్టూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్షపై వైద్య సిబ్బంది సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు శారద, ఆశోక్‌కుమార్‌రెడ్డి, వైద్యులు లోకేష్, ఎంపీహెచ్ఈఓ మధుకుమార్, సూపర్‌వైజర్ హాజీవలి, పంచాయతీ కార్యదర్శులు కృష్ణవేణి, స్నేహ, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: కరిడికొండ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. అనగానదొడ్డికి చెందిన మాధవరెడ్డి, శివారెడ్డి నంద్యాల జిల్లా డోన్ మండలం తిరునాంపల్లికి బైక్‌పై బయలుదేరారు. కరిడికొండ శివారులో వెనుక నుంచి వచ్చిన బస్సు బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో మాధవరెడ్డి, శివారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. హైవే అంబులెన్స్‌లో వారిని గుత్తి ఆసుపత్రికి తరలించారు.

ఒకరికి తీవ్రగాయాలు

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం పగిడిరాయి సమీపంలో శనివారం బైక్ పైనుంచి పడి వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పగిడిరాయికి చెందిన గుండుమయ్య గ్రామానికి బైక్‌పై వస్తుండగా గ్రామ శివారు మలుపు వద్ద అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు.

గాజులపల్లిలో చోరీ

గుత్తి రూరల్: గాజులపల్లిలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు నాగాంజనేయులు, లలితమ్మ దంపతులు ఇంటికి తాళం వేసి శుక్రవారం పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లారు. అయితే సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరచి ఉంటడంతో లోపలకు వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉన్న రూ.10వేలు నగదు, మూడు తులాల తాళిబొట్టు, రెండు తులాల కమ్మలు, ఉంగరం, మాటీలు, లోలాకులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు 'ఆలూరు' పర్యటన

నార్పల: మండల కేంద్రంతో పాటు బి.పప్పూరు ,గంగనపల్లి, గూగూడు గ్రామాల్లో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి పర్యటించేనున్నట్లు రాష్ట్ర ఎంఎస్ ఎంఈ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బి.పప్పూరు సచివాలయం, ఆర్బీకే, గంగనపల్లిలో సచివాలయం, ఆర్బీకే, విలేజ్ క్లినిక్, గూగూడులో సచివాలయం, విలేజ్ క్లినిక్, ఆర్బీకే,మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

వ్యక్తిపై తేనెటీగల దాడి

గార్లదిన్నె: తిమ్మంపేటలో శనివారం ఓ వ్యక్తిపై తేనెటీగలు దాడి చేశాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ రెడ్డి పొలం వద్దకు వెళ్లగా అక్కడ తేనెటీగల గుంపు దాడి చేశాయి.స్థానికులు గమనించి వెంటనే అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

బుక్కరాయసముద్రం: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని సీఐ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో శింగనమల నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. సీఐ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పీడీలు గోపాల్‌రెడ్డి, పక్కీరప్ప, ఉగాది నాయక్, నరసింహారెడ్డి, నరేంద్రరెడ్డి, వెంకటేష్, శంకర్, నందకుమార్, వరలక్ష్మి, బయపరెడ్డి, రాంప్రసాద్, నారాయణ పాల్గొన్నారు.

శింగనమల: బుక్కరాయసముద్రంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల్లో శింగనమల హైస్కూల్ విద్యార్థులు ప్రతిభకనబర్చినట్లు హెచ్ఎం సుజాతమ్మ, పీడీ నందకుమార్ తెలిపారు. అండర్-14 డిస్క్‌త్రోలో బి.కార్తీక్ మొదటి స్థానం, షాట్‌పుట్‌లో రెండవ స్థానం కే.గోవర్ధన్, 100 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానం కే.శివకుమార్, అండర్-17 హైజంప్‌లో శివకుమార్ మూడో స్థానంలో నిలిచారన్నారు. ఇదే పోటీల్లో ఈస్ట్ నరసాపురం ఎంజేపీ విద్యార్థినులు 11 పతకాలు సాధించి, జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంజేపీ స్కూల్ ప్రిన్సిపాల్ సంగీతకుమారి, పీఈటీ శివమ్మ తెలిపారు. అండర్-17లో 100 మీటర్ల పరుగు పందెంలో సీ.సంధ్య ప్రథమ, సవిత ద్వితీయ, డిస్క్‌త్రోలో ప్రథమ స్థానం, షాట్‌పుట్‌లో కే.భవ్యశ్రీ ద్వితీయ స్థానం సాధించారన్నారు. జావలిన్‌త్రోలో మౌనిక ద్వితీయ, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్‌లో సీ.సంధ్య, హైజంప్‌లో కే.సంజన ద్వితీయ, అండర్-14లో 200 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్‌లో నాగశ్వేత ద్వితీయ, డిస్క్‌త్రోలో హరి ద్వితీయ స్థానం సాధించారన్నారు.

యువకుడి దుర్మరణం

- ఐచర్‌ను ఢీ కొన్న బైక్
- మరొకరి పరిస్థితి విషమం



మృతుడు మనోజ్‌కుమార్

తాడిపత్రి: ఐచర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహన చోదకుడు దుర్మరణం పాలయ్యాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన డేరంగుల మనోజ్‌కుమార్ (23), శనివారం ఉదయం తన స్నేహితుడు ఈశ్వర్‌తో కలసి అనంతపురం నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. పట్టణ శివారులోని సీవీఆర్టీ కళాశాల సమీపంలోకి చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక జాతీయ రహదారిపై యూ టర్న్ తీసుకుంటున్న ఐచర్ వాహనాన్ని ఢీకొన్నాడు. ఘటనలో మనోజ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఈశ్వర్‌ను స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని వైద్యశాలకు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఘటనాస్థలాన్ని తాడిపత్రి రూరల్ పోలీసులు పరిశీలించి, మృతుడి తండ్రి వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కాపుల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

తాడిపత్రి అర్బన్: కాపుల పక్షపాతి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని తాడిపత్రి బలిజ సంఘం నాయకులు కొనియాడారు. వైఎస్సార్ కాపునేస్తం నిధులు విడుదల చేసిన సందర్భంగా శనివారం స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బలిజ సంఘం అధ్యక్షుడు కల్లూరు శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్.జగన్ అని అన్నారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ మాట తప్పని మడమ తప్పనినేతగా పేరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. సంకల్ప పాదయాత్రలో రాష్ట్ర ప్రజలు పడిన కష్టాలను కళ్లారా చూసిన వైఎస్.జగన్ అధికారంలోకి వచ్చిన తక్షణమే పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. బలిజ సంఘం నాయకులు రాచపాలెం ప్రసాద్, గురుమహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

పంట నమోదు తప్పనిసరి

పామిడి: మండలంలోని పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏడీఏ ఎం వెంకట్రాముడు అన్నారు. శనివారం రామరాజుపల్లిలో నిర్వహిస్తున్న పంట నమోదును ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పంట నమోదును పకడ్బందీగా చేపట్టాలని ఈసందర్భంగా ఆయన విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు (వీఏఏ) సూచించారు. కౌలు రైతులకు పంట రుణాలు ఇప్పించాలన్నారు. ఏఓ డీ లీనా వసుంధర, ఏఈఓ శ్రీనివాసరావు, ఎంపీపీ భోగతి మురళీమోహన్‌రెడ్డి, సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడి పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలతో పర్యావరణ పరిరక్షణ

పుట్లూరు: మట్టి వినాయక ప్రతిమలతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి,ఉపాధ్యాయుడు కిశోర్ పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థులతో దాదాపు 200 మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయించి వారికే అందజేశారు.

గుంతకల్లు రూరల్: మట్టి వినాయకులను పూజిద్దామని కాపు సంక్షేమ సేన నియోజకవర్గ అధ్యక్షుడు రాయల్ రంగ పేర్కొన్నారు. కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో శనివారం కసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మట్టి విగ్రహాల తయారీపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ప్రజలకు చేరువగా ప్రభుత్వ సేవలు



గంగాదేవిపల్లిలో ప్రభుత్వ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోని అన్ని సేవలను ప్రజలకు చేరువగా తీసుకొచ్చారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. శనివారం గంగాదేవిపల్లిలో నిర్మించిన సచివాలయ, ఆర్బీకే భవనాలను ఆయన ప్రారంభించారు. అంతకుముందు సర్పంచ్ హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లోనే కార్యాలయాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు దాదాపు 500లకు పైగా సేవలను గ్రామ సచివాలయాల్లోనే అందిస్తున్నారన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రజలు పట్టణాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే ఉచితంగా వైద్యం చేయించుకునేందుకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇంటి వద్దే వైద్యం అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ప్రభుత్వం అందించే అన్ని రకాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ మునివేలు, ఏడీఏ చెంగల్రాయుడు, ఈఓఆర్డీ జిలాన్ బాషా, జెడ్పీటీసీ రమణమ్మ, ఎంపీటీసీ గంగిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ హరినాథరెడ్డి, వైస్ చైర్మన్ ఓబుళరెడ్డి, ఇగుడూరు గంగమ్మ, ఆలయ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు శివారెడ్డి, పుల్లారెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, ఇగుడూరు రాజు, తలారి చెరువు గంగరాజు, వ్యవసాయాధికారులు, సచివాలయ, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

గుత్తి: పట్టణంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 11 రోజులుగా జరుగుతున్న కృష్ణాష్టమి వేడుకలు శనివారం ముగిశాయి. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హాజరుకాగా త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి సభ్యులు స్వాగతం పలికారు. కృష్ణుని ప్రతిమ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే స్వయంగా స్వామి పల్లకీని మోసి ఊరేగింపును ప్రారంభించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నుంచి వచ్చిన త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి సభ్యులు , వందలాది మంది భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. పలువురు ముస్లింలు పల్లకీని మోయడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, ఎంపీపీ విశాలాక్షి, సీనియర్ నాయకులు శ్రీనివాస రెడ్డి, పీరా, కౌన్సిలర్ అంజల పాల్గొన్నారు.

రంగులు వేసుకుంటేనే పవన్‌కు విలువ

గుత్తి: రంగులు వేసుకుని సినిమాల్లో నటిస్తేనే పవన్ కళ్యాణ్‌కు విలువ ఉంటుందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిలకడలేని పవన్ రాజకీయాల్లో ఎలా రాణిస్తారని ప్రశ్నించారు. రెండు రోజుల క్రితం పవన్ కళ్యాణ్ రాజమండ్రి సెంట్రల్ జైలు జనసేన టీడీపీతో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తుందని ప్రకటించారన్నారు. పవన్ పార్టీ పెట్టినప్పటి నుంచి చంద్రబాబుతో అంటకాగుతున్నాడని, ఇపుడు కొత్తగా కలిసేది ఏముందన్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి చర్చించకుండా తనకు టీడీపీతో కలవాలనిపిస్తుందనే అందుకే కలిశానని పవన్ చెప్పడం సిగ్గు చేటన్నారు. పార్టీ క్యాడర్, ఫ్యాన్స్ , ఇతర నాయకులుతో కలిసి చర్చించాక పొత్తుల ప్రకటన చేసి ఉంటే కొంతైనా మేలు జరిగేదన్నారు. బీసీ సెల్ జిల్లా కార్యదర్శి బేడల వెంకటరాముడు, జిల్లా నాయకులు బళ్లారి రాజ్‌కుమార్‌రెడ్డి, పగడాల శ్రీనివాసులు, గురుప్రసాద్‌యాదవ్, మధుసూదన్‌రెడ్డి ఎస్సీ సెల్ రాష్ట్ర , జిల్లా నాయకులు భీమలింగ, మైనార్టీ రాష్ట్ర నాయకులు మర్తాడు అన్వార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నిర్మలారెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టి నష్టపోయిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చివరకు అప్పులు తీర్చే మార్గం కానరాక బలవన్మరానికి పాల్పడగా... కుటుంబకలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తితో మరో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు...

తాడిపత్రి అర్బన్: మండలంలోని యర్రగుంటపల్లి నివాసి తగుల్లా పెనుకొండ ఓబిరెడ్డి (26) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుండేవాడు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయాడు. ఈ క్రమంలో అక్కడ ఉండలేక చివరకు గత నెల 15న తన ఉద్యోగాన్ని వదిలేసి స్వగ్రామానికి చేరుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక జీవితంపై విరక్తి పెంచుకున్న ఓబిరెడ్డి ఈ నెల 18న తాడిపత్రిలో విషపూరిత ద్రావకం తాగాడు. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక శుక్రవారం రాత్రి ఓబిరెడ్డి మృతి చెందాడు. ఘటనపై బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ హమీద్‌ఖాన్ దర్యాప్తు చేపట్టారు.

పామిడి: మండలంలోని పి.కొత్తపల్లికి చెందిన సుబ్బిరెడ్డి(53) శనివారం స్థానిక పెన్నానది ఒడ్డున ఆత్మహత్య చేసుకున్నాడు. గత శుక్రవారం సుబ్బిరెడ్డి ఇంట్లో 5 తులాల బంగారు నగలు, రూ.50వేలు చోరీ అయిన విషయం తెలిసిందే. శనివారం వేకువజామున సుబ్బిరెడ్డి ఇంటి ప్రహరీలోనే నగలు దొరికాయి. ఈ విషయంగా కుటుంబసభ్యుల మధ్య గొడవ చోటు చేసుకుంది. దీంతో మనస్తాపం చెందిన సుబ్బిరెడ్డి పామిడిలోని పెన్నానది ఒడ్డుకు చేరుకుని తనతో పాటు తెచ్చుకున్న విషపు గుళికలు మింగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సుబ్బిరెడ్డిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించేలోపు ఆయన మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఎమ్మెల్యేకు డ్వాక్రా మహిళల కృతజ్ఞతలు

తాడిపత్రి: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో ఆసరా డబ్బు ఖాతాల్లో జమకావడంతో డ్వాక్రా మహిళలు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. వివరాలు..అయ్యవారిపల్లికి చెందిన శ్రీ లక్ష్మి పొదుపు సంఘానికి సంబంధించి వైఎస్సార్ ఆసరా డబ్బు జమకావడం లేదు. డ్వాక్రా మహిళలు సమస్యను ఇటీవల ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఉన్నతాధికారులతో ఆసరా డబ్బు విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు ఉన్నతాధికారులు రూ.3.8 లక్షలను శ్రీ లక్ష్మి పొదుపు సంఘానికి జమ చేశారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను డ్వాక్రా మహిళలు శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు.

మృతుల కుటుంబానికి సంతాపం యాడికి మండలం నిట్టూరుకు చెందిన దంపతులు బాలరాజు, సుంకులమ్మ మృతికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సంతాపం ప్రకటించారు. శనివారం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రిలోని మార్చులో ఉన్న మృతదేహాలను ఎమ్మెల్యే పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.



ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని సన్మానిస్తున్న డ్వాక్రా మహిళలు